జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 57 శుక్రవారం 18 జూలై 2025 పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు
## సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి




జులై 17(సందేశం టైమ్స్) : తెలంగాణలో సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .. కేంద్ర ఐటీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. రాష్ట్రంలో అధునాతన సౌకర్యాలు, పరిశోధన కేంద్రాలు ఉన్నందున , మైక్రో ప్రాజెక్టులకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు.రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు 2.0 పథకం కింద అనుమతి ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ ఇప్పటికే పరిశోధనా సౌకర్యాలతో, సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ముందంజలో ఉన్నదని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఉద్యోగాలు, పెట్టుబడులు పెరగడంతోపాటు, దేశీయ టెక్నాలజీ రంగానికి తెలంగాణ కీలక కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కొత్త రైలు మార్గాలు

రూ.8 వేల కోట్ల విలువైన రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్‌కు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరగడంతో పాటు హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుతో గ్రామీణ పేదరికం తగ్గడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. దీంతోపాటు కాజీపేటలో రైల్వే డివిజన్ ఏర్పాటు చేసి, ప్రయాణికులకు వేగవంతమైన సేవలు అందించాలన్నారు.



## డ్రగ్స్ కేసు ఆరోపణలు సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఫైర్ !

జులై 17(సందేశం టైమ్స్) :డ్రగ్స్ కేసులో తనపై చేస్తున్న ఆరోపణలకు సంబంధించి తెలంగాణ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రి పదవికి గౌరవం ఇవ్వడానికి తాను కట్టుబడి ఉన్నానని, ఇక నుంచి తాను మౌనంగా ఉండనని స్పష్టం చేశారు.తనపై డ్రగ్స్ కేసుల్లో దర్యాప్తు జరుగుతోందని రేవంత్ చేసిన వ్యాఖ్యలకు ఆధారమేంటి అని ప్రశ్నిస్తూ, ఎటువంటి సాక్ష్యం ఉన్నా బయటకు తేవాలని కేటీఆర్ సవాల్ విసిరారు."నాపై ఒక్క కేసు కూడా నమోదైందా? కనీసం ఒక ఆధారం ఉన్నదా? ఉంటే చూపించండి. లేకుంటే ఇది మీ చీప్, అసభ్యమైన, నిరాధార కథనమని ఒప్పుకోండి," అని కేటీఆర్ తేల్చి చెప్పారు.తనను ఎదుర్కొనే ధైర్యం రేవంత్‌కి లేదని, అందుకే ఢిల్లీ వెళ్లి మీడియా చిట్‌చాట్ పేరుతో వెనకటి మాటలు మాట్లాడుతున్నాడని కేటీఆర్ ఆరోపించారు. చిట్‌చాట్స్ రూపంలో అసత్య ఆరోపణలు చేసి చట్టపరమైన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు."ఇకపై వెనక్కి తగ్గేది లేదు. రేవంత్‌రెడ్డి నిన్ను కోర్టుకు లాగి ఒక్కో అసత్య వ్యాఖ్యకు చట్టపరంగా బుద్ధి చెబుతాను," అని కేటీఆర్ హెచ్చరించారు. రేవంత్ వెంటనే క్షమాపణ చెప్పకపోతే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోక తప్పదని తేల్చి చెప్పారు.

## బనకచర్లను ఆపేందుకు
## ఎందాకైనా పోరాడుతాం.. కెటిఆర్

- సీఎం రేవంత్ నిర్ణయం మారకపోతే మరో ఉద్యమం
- ఇరిగేషన్‌పై రేవంత్‌కు అవగాహన లేదు
- గోదావరి జలాలపై బీజేపీ వైఖరి చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సిరిసిల్ల, జులై 17(సందేశం టైమ్స్) : గోదావరి జలాలపై కేంద్రంలోని బీజేపీ వైఖరి చెప్పాలని, బనకచర్లపై పోరాటానికి ఎందాకైనా సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ నీళ్లను తీసుకుపోతామంటే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. ఏపీతో చర్చల అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఉపసహరించుకోవాలని, ఒకవేళ నిర్ణయం మారకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చిరించారు. తెలంగాణలో కోవర్టు పాలన నడుస్తోందని ఎద్దేవా చేశారు.

బీజేపీ వైఖరి చెప్పాలి


గోదావరి జలాలపై బీజేపీ వైఖరి చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో సమావేశం పెట్టించింది, కమిటీ వేసేది చంద్రబాబేనని, తెలంగాణకు మళ్లీ ద్రోహం చేసేందుకు పెద్ద కుట్రే జరుగుతోందని కామెంట్ చేశారు. ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్లపై పోరాటానికి ఎక్కడి వరకైనా సిద్ధంగా ఉన్నామని అన్నారు. నీళ్ల వాటాలు తేలాకే ఏ ప్రాజెక్ట్ చేపట్టాలని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి ఇరిగేషన్ గురించి తెలియదని.. ఆయనకు తెలిసింది రియల్‌ఎస్టేట్, బ్లాక్ మెయిల్ దందాలేనని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రాయలసీమకు కూడా ప్రయోజనం కలగాలనే ఆకాంక్షించారని.. చంద్రబాబులా ఎత్తులకు పైఎత్తులు వేస్తూ కుట్రలు చేయలేదని కేటీఆర్ మండిపడ్డారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..
## కొండా సురేఖ



సిద్దిపేట, జులై 17(సందేశం టైమ్స్): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట లోని సురభి వైద్య కళాశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఐదు మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. రోజురోజుకు పర్యావరణం కలుషితం అవుతుందని, మొక్కల పెంపకం ద్వారానే నియంత్రించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల చైర్మన్ సురభి హరేందర్‌రావు, సెక్రటరీ సురభి మహేందర్ రావుతో పాటు వైద్య కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఊరట..



హైదరాబాద్,జులై 17(సందేశం టైమ్స్) :: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. గతంలో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును హైకోర్టు రద్దు చేసింది. 2016లో హౌసింగ్ సొసైటీ స్థలాన్ని అక్రమించేందుకు ప్రయత్నిం చారని పెద్దిరాజు అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా, రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, మరో వ్యక్తి లక్ష్మయ్యలపై కేసు నమోదైంది. పెద్దిరాజు ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు ఎస్సీ, ఎస్టీ నిర్బంధ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలంటూ 2020లో రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.గత నెల 20న ఇరువైపుల వాదనలు పూర్తవగా, న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. న్యాయస్థానం తుది ఉత్తర్వులు నేడు వెలువరించింది. ఈ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంఘటనా సమయంలో రేవంత్ రెడ్డి ఘటనాస్థలిలో లేరని దర్యాప్తులో తేలిందని పేర్కొంది. అలాగే, ఫిర్యాదుదారు చేసిన ఆరోపణలకు సరైన సాక్ష్యాధారాలు లేవని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కేసును కొట్టేస్తూ తీర్పునిచ్చింది.

## సింగూరు డ్యామ్ నుంచి నీటిని
## విడుదల చేసిన మంత్రి దామోదర



సంగారెడ్డి , జులై 17(సందేశం టైమ్స్): సింగూరు డ్యామ్ నుంచి మంత్రి దామోదర రాజనర్సింహ నీటిని విడుదల చేశారు. సింగూరు ఎడమ కాలువ నుంచి సాగు కోసం 100 క్యూసెక్కుల నీటిని మంత్రి విడుదల చేశారు. రెండు పంటల క్రాప్ హాలిడే తర్వాత నీటిని విడుదల చేశారు. సింగూరు ఎడమ కాలువ మరమ్మతుల నేపథ్యంలో రెండు పంటలకు అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించారు. రైతులు పంట సాగుకు ఇబ్బందుల దృష్ట్యా మంత్రి దామోదర్ రాజనర్సింహ నీటిని విడుదల చేశారు.

# హంద్రీనీవా నుంచి నీటిని విడుదల చేసిన సీఎం చంద్రబాబు



కర్నూలు జులై 17(సందేశం టైమ్స్) : నందికొట్కూరు మండలం మల్యాల గ్రామం హెచ్ఎన్ఎస్ఎస్ పంపింగ్ స్టేషన్ వన్ నుంచి హంద్రీనీవా సుజల స్రవంతి కాల్వకు శ్రీశైలం కృష్ణా జలాలను ఎత్తిపోతల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీటిని విడుదల చేశారు. మల్యాలలోని హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు పంపింగ్ స్టేషన్ వన్ వద్దకు మధ్యాహ్నం 1.40 గంటలకు చంద్రబాబు చేరుకున్నారు. ముఖ్యమంత్రికి మంగళ వాయిద్యాలతో ఆహ్వానం పలికి.. వేదమంత్రాలతో పండితులు ఆశీర్వచనం చేశారు.ఈసందర్భంగా హెచ్ఎంఎస్ఎస్ ప్రాజెక్టు కు సంబంధించి జలవనరుల శాఖ అక్కడ ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను, ప్రాజెక్టు అలైన్ మెంట్ ఆయకట్టు, కృష్ణా రివర్ బేసిన్ మ్యాపులను సీఎం తిలకించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే పంపింగ్ స్టేషన్ వ్యూ పాయింట్ నుంచి నీటిని పరిశీలించారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పంపింగ్ స్టేషన్ లో స్విచ్ ఆన్ చేసి శ్రీశైలం కృష్ణా జలాలను ఎత్తిపోతల ద్వారా హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ప్రాజెక్టుపైకి చేరుకొని మల్యాల ఎత్తిపోతల వద్ద హంద్రీనీవా జలాలకు జలహారతులు ఇచ్చి, రైతుల హర్షధ్వానాల మధ్య పట్టు వస్త్రాలు సమర్పించారు.అనంతరం శ్రీశైలం బ్యాక్ వాటర్స్ నుంచి సీమ జిల్లాలకు వివిధ కాల్వలకు.. రిజర్వాయర్లకు విడుదల చేసిన నీటిని సక్రమంగా వినియోగించుకునేలా ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని చంద్రబాబు సూచించారు. ఇరిగేషన్ శాఖ అంటే ప్రాజెక్టులు.. కాల్వలే కాకుండా.. భూగర్భ జలాల వినియోగం వంటివి కూడా చూసుకోవాలన్నారు. తిరుపతి వద్ద గాలేరు-నగరి, హంద్రీ-నీవా, సోమశిల-స్వర్ణముఖి కలిసేలా ప్రణాళికలు చేసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు.

## ఫ్యాక్షన్ బాధిత కుటుంబానికి మంత్రి లోకేష్ అండ




అమరావతి, జులై 17(సందేశం టైమ్స్) : ఫ్యాక్షన్ బారిన పడి సర్వం కోల్పోయిన కుటుంబానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అండగా నిలిచారు. రాయలసీమలో బోయ నరసింహులు కుటుంబం ఫ్యాక్షన్ భూతానికి బలి అయ్యింది. ప్రత్యర్థుల చేతుల్లో బోయ నరసింహులు సహా ముగ్గురు కిరాతకంగా హత్యకు గురయ్యారు. ఈ క్రమంలో బోయ నరసింహులు కుటుంబాన్ని మంత్రి లోకేష్.. ఉండవల్లి నివాసానికి పిలుపించుకుని మాట్లాడారు. కుటుంబానికి అండగా ఉంటానని, అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

కాగా.. రాయలసీమలో ఫ్యాక్షన్ బారిన పడి నష్టపోయిన కుటుంబాలను ఉండవల్లి నివాసానికి పిలుపించుకుని మాట్లాడారు మంత్రి. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గం కామిరెడ్డిపల్లికి చెందిన దాసరి నరసింహులు టీడీపీలో మొదటి నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. దీంతో ప్రత్యర్థులు దారి కాచి 2011లో ద్విచక్రవాహనంపై వెళ్తున్న బోయ నరసింహులు సహా అతని కుమారుడు, కుమార్తెను దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. ఫ్యాక్షన్ బారిన పడి బోయ నరసింహులు కుటుంబం ఎంతో నష్టపోయింది.

## స్వచ్ఛ సర్వేక్షణ్? 2024-25లో ఏపీకి ఐదు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు..



జులై 17(సందేశం టైమ్స్) : కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే 2024-25లో (2024-25) ఇండోర్ వరుసగా 8వ సారి అత్యంత పరిశుభ్రమైన నగరంగా నిలిచింది. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఐదు అవార్డులు గెల్చుకుని వావ్ అనిపించింది. స్వచ్ఛ సర్వేక్షన్-2025 అవార్డుల కార్యక్రమంలో రాష్ట్రం నుంచి విజయవాడ, తిరుపతి, గుంటూరు, గ్రేటర్ విశాఖపట్నం (జీవీఎంసీ), రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ల అవార్డులు దక్కించుకున్నాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ అవార్డు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్‌తో పాటు రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు, ఆయా కార్పొరేషన్ల అధికారులు పాల్గొన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు అందుకోవడం గర్వకారణమని, ఈ విజయానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందిని మంత్రి నారాయణ హృదయపూర్వకంగా అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛ భారత్ మిషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి తెలిపారు. ఈ క్రమంలో ప్రతి నెల మూడో శనివారం నియోజకవర్గంలో స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించేందుకు రాష్ట్రం సన్నద్ధమవుతోందని, స్వచ్ఛతా కార్యక్రమాలకు ప్రజల సహకారం, అధికారుల అంకితభావం కూడా కీలకమని మంత్రి వెల్లడించారు.

## కన్నీళ్లు పెట్టుకున్న టీడీపీ ఎమ్మెల్యే!



మైలవరం, జులై 17(సందేశం టైమ్స్) : మైలవరం టీడీపీ ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆయన వ్యక్తిగత కార్యదర్శి కట్టా నరసింహారావు ఆకస్మిక మృతి చెందారు. నరసింహారావు మృతదేహాన్ని చూసి ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ చలించిపోయారు. హైదరాబాద్ నుంచి కుటుంబ సభ్యులతో వచ్చి నక్కలంపేటలో కట్టా నరసింహారావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసింహారావు మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కృష్ణ ప్రసాద్, బాధను తట్టుకోలేక కన్నీటి పర్యంతమయ్యారు.

## జగన్ వ్యాఖ్యలపై పోలీసు అధికారుల సంఘం ఫైర్




విజయవాడ, జులై 17 జులై 17(సందేశం టైమ్స్) :: పోలీసులను ఉద్దేశించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు ఫైర్ అయ్యారు. జగన్ వ్యాఖ్యలను ఏపీ పోలీసు అధికారులు సంఘం అధ్యక్షులు జనకుల శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. ప్రతీ అంశంలో పోలీసులపై విమర్శలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. వైసీపీ నాయకులను అరెస్టు చేసేందుకు పోలీసు వ్యవస్థ ఉందన్నారు. తనకు రక్షణ కల్పించకుండా కుట్రలు చేస్తున్నారని సీఎంగా పని చేసిన వ్యక్తి మాట్లాడటం సబబు కాదని విమర్శించారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని తెలుసుకోవాలని ఆయన హితవుపలికారు.

డీజీపీని టార్గెట్ చేయడం ఏంటి..

వైసీపీ ప్రభుత్వంలో కూడా తాము చట్ట విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసులు పెట్టామని.. అరెస్ట్‌లు చేశామన్నారు. పోలీసులను వీఆర్‌లో పెట్టడం అనేది గత ప్రభుత్వంలో చేశారని మండిపడ్డారు. ఆరోపణలు వచ్చిన అధికారులపై చర్యలు సహజమని చెప్పుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎంత మంది పోలీసులను పక్కన పెట్టారో గుర్తు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులకు పోలీసులు వాటాలు పంచుతున్నారని చెప్పడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఐజీ స్థాయి అధికారిని డాన్ అని చెప్పడం సరికాదన్నారు. పోలీసు వ్యవస్థను నడిపే డీజీపీని టార్గెట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆయన సారధ్యంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని తెలిపారు. ఎక్కడో ఒకచోట పోలీసు శాఖలో కొన్ని లోపాలు ఉండొచ్చని, పొరబాట్లు జరిగి ఉండవచ్చన్నారు. అలా అని పోలీసులు మొత్తాన్ని కించ పరిచేలా మాట్లాడటం సరికాదని శ్రీనివాసరావు వ్యాఖ్యలు చేశారు.

## వల్లభనేని వంశీకి సుప్రీం షాక్ .. ముందస్తు బెయిల్ రద్దు



హైదరాబాద్ జులై 17(సందేశం టైమ్స్) : అక్రమ మైనింగ్ కేసులో వైసిపి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ను జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనం అనుమతించింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినకుండా ముందస్తు బెయిల్ ఇవ్వడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. ఈ పిటిషన్పై తాజాగా విచారణ చేపట్టాలని ఆదేశించింది. కేసు మెరిట్స్‌లోకి, పీటీ వారెంట్లోకి వెళ్లడంలేదని పేర్కొంది.

## తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత గౌరు వెంకట్ రెడ్డికి ఎన్నారైల సత్కారం

ఎన్నారై డెస్క్: జులై 17(సందేశం టైమ్స్): అమెరికా పర్యటనలో ఉన్న టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకట్ రెడ్డిని ప్రవాసాంధ్రులు ఘనంగా సత్కరించారు. అమెరికా పర్యటనలో భాగంగా పెన్సిల్వేనియా రాష్ట్రంలోని చెస్టర్ స్ప్రింగ్స్ నగరంలోని ప్రవాసాంధ్రులతో సమావేశమైన గౌరు వెంకట్ రెడ్డి ఎన్నారైలను పాణ్యం నియోజకవర్గ అభివృద్ధిలో సహకరించాలని కోరారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పాణ్యం నియోజకవర్గాన్ని మెగా ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేస్తోందని, ఎమ్మెల్యే గౌరు చరిత నాయకత్వంలో పాణ్యం నియోజకవర్గం హైదరాబాద్ బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో కీలకపాత్ర పోషించనుందని అన్నారు. ఎన్నారైలు తమ నైపుణ్యం, పెట్టుబడులతో ముందుకు వచ్చి తమవంతు పాత్ర పోషించాలని కోరారు.

## ఉపాధి హామీ పథకంతో మారుతున్న గ్రామాల రూపు రేఖలు - పవన్ కల్యాణ్

వెలగపూడి, జులై 17(సందేశం టైమ్స్) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దక్షిణాది రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన తన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకొని ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నాయని వెల్లడించారు. ఇక, ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతుండటంతో, రాష్ట్రంలోని గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని పవన్ చెప్పుకొచ్చారు. అధికారుల పని తీరును ఎప్పటికప్పుడు సోషల్ ఆడిట్ ద్వారా సమీక్షిస్తూ, నాణ్యతా తనిఖీలు, పారదర్శకత, జవాబు దారీతనాన్ని పాటించడం వల్ల ఇతర రాష్ట్రాల అధికారులు కూడా ఆంధ్రప్రదేశ్ పని తీరును మెచ్చుకుంటున్నారని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

# పండ్ల తోటల పెంపకానికి తోడ్పాటు



మన్ననూర్, జూలై 17 (సందేశం టైమ్స్):పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ శరత్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ఇందిర సౌరగిరి జల వికాసం పథకం ద్వారా చెంచు రైతులు సాగు చేస్తున్న పండ్ల తోటలను బుధవారం ఆయన పరిశీ లించి, వారితో మాట్లాడారు. తమకు ట్రాక్టర్‌ను సమకూర్చి, వ్యవసాయ పరికరా లను అందించాలని వారు ఆయనను కోరారు. అనంతరం మాచారంలోని కోదండ రామాలయాన్ని సందర్శించారు. అంతకు ముందు మన్ననూరులో ఆదిమవాసీ గిరిజన విద్యాలయం (పీటీజీ)ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంటును పరిశీలించారు. వసతులపై అధికారులు, సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థులతో సమావేశ మయ్యారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, క్రమ శిక్షణతో విద్యాభ్యాసం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అనూష ప్రాజెక్ట్సు ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ జలంధర్ రెడ్డి, మాజీ సర్పంచులు పెద్దిరాజు, పద్మ, రైతులు అలివేల, లక్ష్మయ్య, మల్లయ్య, గిరిజన గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్త సుధాకర్, ఏపీవో యాదమ్మ, ప్రిన్సిపాల్ నిమ్మల పద్మావతి పాల్గొన్నారు.

# విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి



చెన్నూరు, జూలై 17 (సందేశం టైమ్స్) : ప్రభుత్వ పాఠ శాలల్లోని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. చెన్నూరు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, తాగునీరు, వంటశాల, భోజనశాల, వసతి గృహంలోని వసతులు, పడకలు, మూత్రశాలలు, గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆహారం తయారీ సమయంలో నిబంధనలు పాటించాలని, తాజా కూరగా యలు, నాణ్య మైన నిత్యావసర సరుకులను వినియోగించాలన్నారు. శుద్ధమైన తాగునీటిని విద్యార్థులకు అందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీ లీంచారు. పాఠశాల, కేజీబీవీలో కిటికీలు, తలుపులు, మూత్రశాలలు, ఫ్యాన్‌లు, లైట్లు ఇతర పాడైన వాటిని పరిశీలించి మరమ్మతులు చేసేందుకు అవసరమైన ప్రతి పాదనలు సిద్ధం చేసి సమర్పించాలని, ఎంపీడీవో మోహ న్‌ను ఆదేశించారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కస్తూర్బాదాంధీ బాలికల విద్యాయలంలో పాడైన ఆర్‌వో ప్లాంట్‌ను మరమ్మతులు చేసి శుద్ధమైన నీటిని అందించాలని, పాఠశాలలో కొనసాగుతున్న మర మ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

# అయ్యో పాపం పసికందు!



**ఖిలాషాపురంలో రోడ్డు పక్కన వదిలేసిన తల్లి**
**అకున చేర్చుకున్న స్థానికులు**
**శిశువును చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు**
**అప్పగించిన పోలీసులు**

రఘునాథపల్లి జూలై 17(సందేశం టైమ్స్) :ఓ తల్లి పేగు బంధాన్ని తెంచుకుం టూ పసికందు ను రోడ్డు పక్కన వదిలేసి వెళ్లిపోగా, స్థానికులు అక్కున చేర్చుకున్న ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో రోడ్డు పక్కన గుర్తుతెలియని మహిళ పసికందును వదిలేసి వెళ్లింది. తెల్లవారుజామునే అప్పుడే పుట్టిన మగ శిశువు రోడ్డుపై గుకపెట్టి ఏడుస్తుండడంతో స్థానికులు చలించిపోయారు. %ఓ వృద్ధురాలు పసికందును చేరదీసి స్నానం చేయించింది. బిడ్డ తల్లిదండ్రుల కోసం చుట్టుపకల వెతికినా ఎవరూ కనిపించకపోవడంతో గ్రామ పెద్దలు స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. శిశువును వదిలేసిన వారు చుట్టుపకల వారా? లేదా దూరం ప్రాంతం నుంచి వచ్చి ఇకడ వదిలారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం శిశువును చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగించగా, జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌లో చేర్పించారు. శిశువుకు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్, డాక్టర్ ఉదయ్ వైద్య పరీక్షలు చేశారు.

# ఫెర్టిలైజర్ దుకాణంలో చోరీ..
# నగదు, హార్ట్‌డిస్క్ అపహరణ

చింతలమానేపల్లి జూలై 17 (సందేశం టైమ్స్) : మండలంలోని డబ్బా ఎక్స్ రోడ్‌లో ఉన్న శ్రీ సాయి ఫెర్టిలైజర్ దుకాణంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఫెర్టిలైజర్ దుకాణం యజమాని అధికం మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి 7 గం సమయంలో షాపును శ్రీకాంత్ అనే వ్యక్తి షాప్ బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూడగా షాపు ముందు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ఉన్నాయి. దీంతో దుకాణంలో సామాన్లు చిందరవందగా పడి ఉండడంతో కౌంటర్‌లో ఉన్న రూ. 60 వేలు, హార్డ్ డిస్క్, ఇతర సామాగ్రిని దుండగులు ఎత్తుకెళ్లారు . దుకాణపు యజమాని మహేష్ గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# హైదరాబాద్‌లో అగ్నిప్రమాదం..
# ఎగిసిపడ్డ మంటలు



హైదరాబాద్, జూలై 17 (సందేశం టైమ్స్) :నగరంలోని సనత్‌నగర్ సమతనగర్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. డ్యూరోడైన్ ఇండస్ట్రీస్ పరిశ్రమలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈరోజు (గురువారం) తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మొత్తం ఆరు ఫైరింజన్లు, ఒక రోబోట్ సహాయంతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్లాస్టిక్ ప్లేట్స్, డిన్నర్ సెట్స్ ప్యాకింగ్ వస్తువులు ఉండడంతో భారీగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగింది. అయితే ప్రాణ నష్టం తప్పడంతో స్థానికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు.అగ్ని ప్రమాదం జరిగినట్టు తెల్లవారుజామున 3.56 నిముషాలకు సమాచారం వచ్చిందని హైదరాబాద్ డీఎఫ్‌వో అధికారి శ్రీదాస్ తెలిపారు. అగ్నిప్రమాదంపై మాట్లాడుతూ.. గోడౌన్‌లో ఉన్న సిబ్బంది అప్రమత్తమై మేనేజ్మెంట్‌కు సమాచారం ఇచ్చారని.. మేనేజ్మెంట్ కాల్ చేసి ఫైర్ విషయం అగ్నిమాపక సిబ్బందికి తెలిపారని చెప్పారు. ప్రమాదం జరిగిన గోడౌన్‌లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదని.. డిన్నర్ సెట్స్, బౌల్స్, ప్లాస్టిక్ ప్లేట్స్‌కు సంబంధించిన వస్తువులు గోడౌన్‌లో స్టోర్ చేస్తున్నారని తెలిపారు. మాదాపూర్, పంజాగుట్ట, సికింద్రాబాద్, బాలానగర్ ప్రాంతాల నుంచి ఫైర్ వెహికల్స్ వెంటనే వచ్చి మంటలను అదుపు చేశారన్నారు. ఫైర్ ఫైటింగ్ రోబోట్‌ను కూడా ఆపరేషన్‌కు వినియోగించినట్లు చెప్పారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని.. గోడౌన్‌లో ఉన్న వ్యర్థాలన్నీ తొలగిస్తున్నామన్నారు. ప్రమాదాలపై కంపెనీలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో అధికారి శ్రీదాస్ పేర్కొన్నారు.

# విద్యార్థులపై వివక్ష చూపిన
# ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదు




ఖమ్మం, జూలై 17 (సందేశం టైమ్స్) :విద్యార్థులపై వివక్ష చూపిన ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించలేదని ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు స్పష్టం చేశారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికీ ఇదే గతి పడుతుందని తేల్చిచెప్పారు. రేవంత్ ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్ర విద్యార్థులకు శాపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు, స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'హలో విద్యార్థీ.. చలో కలెక్టరేట్..' పేరిట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.

తొలుత వీవీ పాలెం బస్టాప్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీగా వచ్చిన విద్యార్థులు కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. కలెక్టరేట్ గేటు ఎదుట వీరిని పోలీసులు తాళ్లతోనూ, బారికేడ్లతోనూ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో విద్యార్థులంతా అక్కడే కూర్చొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల బోధనా రుసుములు, ఉపకార వేతనాలను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నాన్ ప్రొఫెషనల్ కోర్సుల ఫీజు రీయింబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్‌లు రూ.2 వేల కోట్లు, ప్రొఫెషనల్ కోర్సులకు రూ.4 వేల కోట్లు పెండింగ్ ఉన్నాయని గుర్తుచేశారు. బకాయిల కారణంగా ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పలుమార్లు నిరవధిక బంద్ నిర్వహించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని విమర్శించారు. ఫీజులు విడుదల చేయకపోవడంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ ఫీజులు విడుదల చేయని పక్షంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు లేక.. అంబులెన్స్ రాలేక..



దహెగాం, జూలై 17(సందేశం టైమ్స్) : ప్రసవం కోసం దవాఖానకు వెళ్లేందుకు అంబులెన్స్ గ్రామం వరకు రాకపోవడంతో ఓ గిరిజన గర్భిణి పురిటి నొప్పులతో నరకయాతన అనుభవిస్తూ ఎడ్లబండిపై వెళ్లి అవస్థలు పడిన ఘటన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం ఖర్జీ గ్రామ పంచాయతీ పరిధిలోని లోహ గ్రామంలో జరిగింది. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం సూరారం గ్రామానికి చెందిన కోరేక సంతోష్ భార్య పుష్పలత మొదటి కాన్పు కోసం ఆసిఫాబాద్ జిల్లాలోని లోహ గ్రామంలోని తల్లిదండ్రులైన సిడం రామయ్య, చిన్నక్క ఇంటికి వచ్చింది. పుష్పలతకు పురిటి నొప్పులు రావడంతో ఆశ కార్యకర్తలకు, 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. రోడ్డంతా బురదమయంగా మారడంతో అంబులెన్స్ ఖర్జీ దాటి లోహ గ్రామానికి వెళ్లే రోడ్డు వెంట అటవీ ప్రాంతం వరకే వచ్చింది. దీంతో పుష్పలతను అంబులెన్స్ వరకు ఆరుకిలోమీటర్లు ఎడ్లబండిపై కుటుంబసభ్యులు తీసుకురావడంతో పురిటినొప్పులతో బాధపడుతున్న ఆమె మరింత అవస్థలకు గురైంది.

# మందులే మార్చేశారు



**రోగులకు ప్రాణాధారమైన మందుల కొనుగోలు విషయంలో ప్రభుత్వ ఆసుపత్రుల అధికారులు చేస్తున్న అక్రమాలు భారీగా వెలుగు చూస్తున్నాయి. ఒప్పంద కంపెనీతో లాలూచీపడి ముడుపులు దండుకుని.. పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాల నుంచి కొనాల్సిన ఔషధాలను జనరిక్, స్థానిక మందుల దుకాణాల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. వాటినే రోగులకు ఇస్తున్నారు. ఈ క్రమంలో రూ.కోట్ల మేరకు అధికారులు కమీషన్ల రూపంలో తమ జేబుల్లో వేసుకుంటున్నారు.**

జూలై 17 (సందేశం టైమ్స్) :స్థానికంగా మందులు కొనుగోలు చేసుకునే వెసులుబాటును బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు ఇష్టారాజ్యంగా ఉపయోగించుకుంటున్నారు. కమీషన్లకు కక్కుర్తి పడుతున్న సూపరింటెండెంట్లు.. తమకు నచ్చిన చోట మందులు కొంటున్నారు. ముఖ్యంగా గుంటూరు, కడపలో మరీ దారుణంగా ఆస్పత్రి ఎదురుగా ఉన్న మందుల షాపుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. రూ.లక్షల విలువైన మందులను కూడా నిబంధనలకు విరుద్ధంగా కొంటున్నారు. స్థానికంగా మందులు కొనుగోలుకు సంబంధించి టెండర్ పిలవాలి. ఎల్-1 కంపెనీని ఎంపిక చేసుకుని మందులు కొనుగోలుకు ఆర్డర్ ఇవ్వాలి. కానీ, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు టెండర్ ప్రక్రియతో సంబంధం లేకుండా వారికి నచ్చిన షాపుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. తద్వారా ప్రభుత్వ నిధులు దారిమళ్లడంతోపాటు.. నాణ్యత లేని ఔషధాలు ఆసుపత్రులకు చేరుతున్నాయి.జన ఔషధి మందులకు బదులు రోగులకు జనరిక్ ఔషధాలు పంపిణీ'పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాల' పేరిట దోపిడీ రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో రోగులకు పంపిణీ చేసే మందుల విషయంలో భారీ దోపిడీ జరుగుతోంది. పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వం భావిస్తుంటే.. అధికారులు మాత్రం సర్కారు సంకల్పాన్ని నీరుగారుస్తున్నారు. ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధ కేంద్రాల(పీఎంబీజేకే) నుంచి కొనుగోలు చేయాల్సిన ఔషధాలను జనరిక్, స్థానిక మందుల షాపుల నుంచి కొనుగోలు చేసి ప్రభుత్వ సొమ్మును రూ.కోట్లలో దండుకుంటున్నారు. 'బోధనాసుపత్రులకు జన ఔషధి శాపం' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించింది. తర్వాత పీఎంబీజేకే పేరుతో రాష్ట్రంలోని అన్ని బోధనాసుపత్రుల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. పీఎంబీజేకేతో బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు ఎంవోయులు చేసుకోవడం, ఎంవోయు చేసుకున్న కంపెనీ సరఫరా చేసిన మందులను పరిశీలిస్తే.. భారీ తేడాలు కనిపించాయి. ఆరోగ్యశాఖ అధికారులు ఏ ఉద్దేశంతో పీఎంబీజేకే నుంచి మందులు కొనుగోలు చేయాలని నిర్ణయించారో ఆ లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు జన ఔషధి మందుల కోసం ఓ కంపెనీతో ఒప్పందం చేసుకున్న దగ్గర నుంచి అనేక అవకతవకలు ఉన్నట్లు తెలుస్తోంది. పీఎంబీజేకే ద్వారా వచ్చే మందులకు ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశంతో ఎంవోయులకు అనుమతిచ్చామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కానీ, వాస్తవంగా క్షేత్రస్థాయిలో జరుగుతోంది వేరు. పీఎంబీజేకే హబ్‌లలో కేవలం 1,965 రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి.అవి కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదు. పైగా పీఎంబీజేకే పనితీరు వేరుగా ఉంటుంది. జన ఔషధి షాపుల యజమానులు వారికి అవసరమైన మందులు ఇండెంట్ పెట్టినా అవి అందుబాటులో ఉండడం లేదు. ఇండెంట్ పెట్టిన నెల తర్వాత హబ్స్‌లోకి వస్తున్నాయి. పైగా హబ్స్‌లో ఏ మందైనా రూ.వేలల్లోనే అందుబాటులో ఉంటున్నాయి. రాష్ట్రంలోని బోధనాసుపత్రుల సిబ్బంది ఒకే రకమైన టాబ్లెట్స్ లక్షల్లో ఆర్డర్లు ఇస్తారు. ఇంత భారీ స్థాయిలో మందులు సరఫరా చేసే సామర్థ్యం పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాలకు లేదు. పైగా బోధనాసుపత్రుకు అవసరమైన మందులు జన ఔషధి కేంద్రాల వద్ద అందుబాటులో ఉండవు. రాష్ట్రంలో చాలా బోధనాసుపత్రుల్లో ఎంవోయుకు విరుద్ధంగా సాధారణ జనరిక్ మందులు సరఫరా అయ్యాయి.నాణ్యత ప్రశ్నార్థకం! పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాలలో మందులు నాణ్యంగా ఉంటాయి. ఇలా నాణ్యమైన మందులు కాకుండా సాధారణ జనరిక్ మందులను సదరు ఒప్పంద కంపెనీ సరఫరా చేసింది. రోగులకు బ్రాండెడ్, జనరిక్ మందుల పట్ల అవగాహన లేకపోవడంతో బోధనాసుపత్రుల ఫార్మసీలో ఏ మందు ఇస్తే ఆ మందులు వాడేస్తున్నారు.స్టిక్కర్ అడిగేవారేరీ? పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాల ద్వారా మందులు ఆర్డర్ పెట్టే ముందు ఖచ్చితంగా పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాలకు సంబంధించిన మందులు మాత్రమే సరఫరా చేయాలని ఆస్పత్రుల అధికారులు స్పష్టంచేయాలి. అనంతరం, సదరు కంపెనీ మందులు సరఫరా చేసిన తర్వాత అన్ని మందులపైన పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాల స్టిక్కర్లు ఉన్నాయో? లేవో? ఆసుపత్రుల్లో సిబ్బంది చూసుకోవాలి. బోధనాసుపత్రుల అధికారులు ఈ నిబంధనలు పాటించడం లేదు. జన ఔషధి మందులు సరఫరా చేస్తామని ఎంవోయు చేసుకున్న కంపెనీ వల్ల రోగులే కాకుండా బోధనాసుపత్రులకు కూడా తీవ్రనష్టం జరిగింది. ఆస్పత్రులకు ప్రభుత్వం కేటాయించిన నిధులు వృథా అవుతున్నాయి.

## తాడేపల్లిగూడెంలోకి.. కాకినాడ బస్సులు రావా ?

తాడేపల్లిగూడెం రూరల్‌జూలై 17 (సందేశం టైమ్స్) :జిల్లాలో వాణిజ్య కేంద్రమైన తాడేపల్లిగూడెం పట్టణంలోకి కాకినాడ డిపో నుంచి ఆర్టీసీ బస్సులు రావడం లేదు. ఈ కారణంగా ఇటు విజయవాడ, అటు కాకినాడ వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో ఆయా ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే వారు బస్సులు మారాల్సి వస్తోంది. నిత్యం వందలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్థులు తాడేపల్లిగూడెం నుంచి విజయవాడ, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళుతుంటారు. రెండేళ్ల క్రితం వరకు ప్రతీ గంటకు తాడేపల్లిగూడెం నుంచి విజయవాడ, కాకినాడ బస్సులు తిరిగేవి. కానీ రోడ్లు బాగుండటం లేదని పట్టణంలోకి రాకుండా హైవే నుంచి దారి మళ్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లకు మరమ్మతులు చేపట్టినా బస్సులను ఇటు మళ్లించలేదు. గూడెం డిపో నుంచి బస్సులను పట్టణంలోకి నడపాలని కాకినాడ డిపోకు లేఖలు రాసినా ఫలితం లేకపోయింది. దీంతో అమలాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల బస్సులే ఆధారమయ్యాయి. లేకుంటే రైలు ప్రయాణాలే దిక్కు అని పట్టణ వాసులు వాపోతున్నారు. 'మా నాన్న విజయవాడలో ఉద్యోగం చేస్తుంటాడు. రోజూ ఉదయం సమయానికి గతంలో కాకినాడ నుంచి వచ్చే బస్సుకు వెళ్లే వారు. సమయం సరిపోయేది. ఇప్పుడు ఆ సమయానికి బస్సు లేకపోవడంతో రోజూ ప్రత్తిపాడు హైవే వద్దకు వెళ్లి అక్కడి బస్సు ఎక్కాల్సి వస్తోంది. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి. ఇలాగే చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. కాకినాడ డిపో బస్సులు పట్టణంలోకి వస్తే చాలా సమస్యలు పరిష్కారమవుతాయి' అని గూడెంకు చెందిన ఎం.శ్రీకర్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జీడి పిక్కల విక్రయాల్లో దళారుల మోసం



వజ్రపుకొత్తూరు,జూలై 17 (సందేశం టైమ్స్) :జీడిపిక్కల దళారులు తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు కొత్త దందాకు తెరలేపారు. చెట్టుపేరు చెప్పుకొని కాయలు అమ్ముకుంటున్న చందాన వ్యవహరిస్తున్నారు. ఒక గ్రామానికి చెందిన జీడి పిక్కలను, మరో గ్రామానికి చెందిన పిక్కలుగా నమ్మబలికి జీడి వ్యాపారులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అక్కుపల్లి, గుణుపల్లి, చీపురుపల్లి, మెట్టూరు పంచాయతీల పరిధిలోని నేలలు సారవంతంగా ఉంటాయి. ఈ భూముల్లో పండే జీడిపిక్కలకు మంచి డిమాండ్ ఉంటుంది. మిగిలిన గ్రామాల్లో పండే పంట కంటే ఈ గ్రామాల్లోని జీడి పంట బాగుంటుందని, కిలో జీడిపప్పు అధికంగా దిగుబడి వస్తుందని వ్యాపారుల నమ్మకం. అందుకే ఈ గ్రామాల పిక్కలను అధిక ధరకు కొనుగోలు చేస్తుంటారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు దళారులు మోసాలకు పాల్పడుతున్నారు. ఎక్కడెక్కడో కొనుగోలు చేసిన పిక్కలను పైన చెప్పిన గ్రామాల పిక్కలుగా నమ్మించి వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ పిక్కల నుంచి ఆశించిన స్థాయిలో పప్పు దిగుబడి రాకపోవడంతో వ్యాపారులు నష్టపోతున్నారు. దళారులు చేస్తున్న మోసాన్ని వారు గుర్తించి అక్కుపల్లి, గుణుపల్లి, చీపురుపల్లి, మెట్టూరు తదితర గ్రామాల పెద్దలకు వివరించారు. ఇదే కొనసాగితే మీ గ్రామాల్లో పండించే పిక్కలకు కూడా డిమాండ్ పడిపోతుందని స్పష్టం చేశారు. దీంతో ఆయా గ్రామాల పెద్దలు అప్రమత్తమై దళారులను పిలిచి మాట్లాడారు. లాభాల కోసం దొంగ వ్యాపారాలు చేయడం తగదని, మరోసారి ఇలా చేస్తే అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## రెండేళ్లకే నూరేళ్లు



జూలై 17 (సందేశం టైమ్స్) :అరుదైన అనారోగ్యంతో బాధపడుతున్న బోసి నవ్వుల చిట్టి తల్లి మృత్యువుతో పోరాడి చివరికి ఓడిపోయింది. తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచేసి కానరాని లోకాలకు వెళ్లిపోయింది. మండలం లోని మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధి చైతన్య నగర్‌కు చెందిన డొక్కా ఈశ్వర్, శ్రావణిల రెండేళ్ల కుమార్తె మోహన అరుదైన స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్ఎంఎ) టైప్-1 సమస్యతో కొంతకాలంగా బాధపడుతోంది. చిన్నారికి రెండేళ్లలోపు రూ.16 కోట్ల విలువైన ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంది. లేకపోతే ప్రాణాలకు ప్రమాదం అని, అప్పటివరకు రూ.6 లక్షల విలువైన సిరప్‌ను పాపకు అందించాలని వైద్యులు తెలిపారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దాతల సహకారం కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల రాజమహేం ద్రవరం వచ్చిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ దృష్టికి కూడా పాప విషయాన్ని తీసుకెళ్లారు.

## సూర్యఘర్‌తో ఉచిత విద్యుత్‌తోపాటు ఆదాయం



రాజుపాలెం :జూలై 17 (సందేశం టైమ్స్) : పిఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకున్న లబ్ధిదార్లను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అభినందించారు. మండలంలోని గణపవరం, కూబాద్‌పురం, రాజుపాలెం, చౌటపాపాయపాలెం, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. గణపవరంలో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు వారితో మాట్లాడారు. సూర్యఘర్ పథకం ద్వారా ఉచిత విద్యుత్‌తో పాటూ ప్రభుత్వానికి విద్యుత్ అమ్మి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో 10 వేల మంది లబ్ధిదారుల ఇళ్లపై సూర్యఘర్ పథకం ద్వారా సౌర పలకలు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కుబాద్‌పురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి కాన్పులకు మొదటి ఎంపిక ప్రభుత్వ ఆసుపత్రులే అయ్యేలా సిబ్బంది పని చేయాలన్నారు.

## లొసుగులపై సలహాలు..సొంతవారి హత్యలు..

క్రోసూరు జూలై 17 (సందేశం టైమ్స్) : కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే తన కొడుకుని హత్య చేశాడు. గతంలో మూగ చెల్లిని, తల్లితండ్రులను, ఆరు నెలల పసికందుని హతమార్చిన దుండగుడు తాజాగా కొడుకునీ చంపడంతో క్రోసూరు పోలీసులు అరెస్టు చేశారు. అచ్చంపేట మండలం పుట్లగూడెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు నాయక్ కొడుకును హత్య చేసి పొలంలో పాతిపెట్టి అనంతరం ఏమీ తెలియనట్లు కొడుకు కనబడ్లేదని అందరిని మభ్యపెట్టేందుకు యత్నించినా భార్య ఫిర్యాదుతో నిజం వెలుగులోకి వచ్చింది. సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రవిబాబు వివరాల ప్రకారం..వెంకటేశ్వర్లు నాయక్, అతని కుమారుడైన మంగ్యానాయక్ (19) మేకలు గొర్రెలు మేపుతుంటారు. మంగ్యానాయక్‌కు తాత రామారావు కొంత పొలం, గొర్రెలను ఆస్తిగా రాశాడు. వీటిని తనకు అప్పగించాలని మంగ్యా నాయక్ తన తాత రామారావును కోరగా ఆయన వెకంటేశ్వర్లు నాయక్‌ను సంప్రదించి ఆస్తిని మంగ్యానాయక్‌కు అప్పగించాలని చెప్పాడు. దీనిపై కక్ష పెంచుకు వెంకటేశ్వర్లు నాయక్ తన కొడుకును చంపి ఎర్రబాలెం పొలంలో పూడ్చిపెట్టాడు. కొడుకెక్కడని భార్య నిలదీయడంతో కనిపించడం లేదని ఒకసారి, పొంతనలేని సమాధానం మరోసారి చెప్పడంతో ఆమె పోలీసులను ఫిర్యాదు చేశారు.

# టీడీపీ ఖాతాలో చీరాల మున్సిపాలిటీ




చీరాల, జూలై 17 (సందేశం టైమ్స్) :బాపట్ల జిల్లా చీరాల మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంది. నూతన చైర్మన్‌గా మించాల సాంబశివరావు ప్రమాణం చేశారు. గత మే 14న మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబుపై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం గెలుపొందింది. అయితే అప్పటికే జంజనం వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆనాటి నుంచి కొత్త చైర్మన్ ఎంపికపై రకరకాల ఊహాగానాలు వచ్చాయి. అయితే పార్టీ అధిష్ఠానం సీల్డ్ కవర్‌లో కొత్త చైర్మన్ పేరును బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసార?థి, ఎంపీ కృష్ణప్రసాద్ ద్వారా కౌన్సిల్‌కు అందజేసింది. మున్సిపల్ సమావేశం ప్రారంభం కాగానే చైర్మన్ అభ్యర్థిగా 19వ వార్డు టీడీపీ కౌన్సిలర్ మించాల సాంబశివరావు పేరును అ??ధికారులు ప్రకటించారు. టీడీపీ నుంచి 20 మంది కౌన్సిలర్లు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గీయులు ఐదుగురు, అలాగే ఎక్స్‌అఫిషియో సభ్యులైన ఎంపీ, ఎమ్మెల్యే మద్దతు తెలపడంతో 27 ఓట్లు మెజారిటీతో ఆయన చైర్మన్‌గా గెలిచారు. ప్రిసైడింగ్ అధికారులు డీఆర్‌వో గంగాధర్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయు డు మించాలకు నియామకపత్రం అందజేయడంతో పాటు ప్రమాణ స్వీకారం చేయించారు.

# నా చావుకి భార్యే కారణం

తాడేపల్లి (ఉండవల్లి), జూలై 17 (సందేశం టైమ్స్) : 'నా మరణానికి నా భార్యే కారణం' అంటూ ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు.. నులకపేటకు చెందిన పోతురాజు బ్రహ్మయ్య(30) కు మంగళగిరికి చెందిన మోహన కౌసల్యతో గతేడాది ఆగస్టులో వివాహమైంది. ఉండవల్లి సాయిబాబా గుడి సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఆషాఢం కావడంతో కౌసల్య పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో బ్రహ్మయ్య మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దానికి ముందు తన మృతికి భార్యే కారణమని సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# తల్లికి వందనం డబ్బు కోసం అత్తమామలపై అల్లుడు దాడి



ఘంటసాల (కృష్ణాజిల్లా), జూలై 17 (సందేశం టైమ్స్) : తల్లికి వందనం డబ్బు కోసం ఓ వ్యక్తి అత్తమామలపై కత్తితో దాడి చేశాడు. ఘంటసాల మండలం కొడాలి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది ఘటన. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చిట్టూరి అజయ్-శ్రీలక్ష్మి భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. అజయ్.. టైల్స్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే గ్రామంలో ఉంటున్న శ్రీలక్ష్మి తల్లిదండ్రులు కర్రా సుబ్బారావు, వెంకటలక్ష్మి ఇంటికి పది రోజుల క్రితం అజయ్ కుటుంబం వెళ్లింది. అజయ్ పెద్ద కుమార్తెకు తల్లికి వందనం పథకం ద్వారా రూ.13 వేల నగదు రాగా, అందులో రూ.8 వేలు తీసుకుని మద్యం తాగాడు. మిగిలిన రూ.5 వేలు కావాలని భార్యతో తరచూ గొడవ పడుతున్నాడు. దీంతో ఆమె రూ.5 వేలు తన తల్లిదండ్రుల వద్ద దాచింది. మంగళవారం రాత్రి కూడా భార్యతో గొడవ పడిన అజయ్.. అడ్డొచ్చిన అత్త వెంకటలక్ష్మి, మామ సుబ్బారావులను విచక్షణ రహితంగా కత్తితో పొడిచాడు. బాధితులను విజయవాడలోని ఆస్పత్రికి తరలించారు.


# ఆరుబయట నిద్రిస్తున్న దంపతులపై పెట్రోల్ పోసి నిప్పు

## భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం.. పల్నాడు జిల్లా ఐనవోలులో దారుణం



నూజెండ్ల, జూలై 17 (సందేశం టైమ్స్) : ఆరు బయట నిద్రిస్తున్న దంపతులపై గుర్తు తెలియని దుండగుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. భార్య ప్రాణాలు కోల్పోగా, భర్త తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామంలో బుధవారం వేకువజామున జరిగింది దారుణం. బాధితుల కుటుంబసభ్యుల కథనం మేరకు.. వ్యవసాయ పనులతో జీవనం సాగించే నీలబోయిన పెద శ్రీను, మంగమ్మ (50) దంపతులు ఇంటి మరమ్మతుల దృష్ట్యా గ్రామ సమీపంలో పాకలో నివసిస్తున్నారు. మరమ్మతులు పూర్తవడంతో సొంతింట్లోకి వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. రాత్రి పాక వద్దే నిద్రించారు. వేకువజామున 2:30 గంటలకు మంటలు గమనించామని వారి కుమారుడు బ్రహ్మయ్య పోలీసులకు తెలిపారు. తండ్రి మంటల్లో కాలిపోతుండగా తానే ఆర్పి వేశానని, తల్లి పక్కనే ఉన్న నీటి ట్యాంక్ వద్దకు వెళ్లి మంటల్ని ఆర్పి వేసుకుందని చెప్పారు. ఇద్దరినీ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మంగమ్మ మరణించారు. పెద శ్రీను పరిస్థితి విషమంగా ఉంది. ఘటనా స్థలాన్ని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పరిశీలించారు. క్లూస్ టీమ్ నమూనాలు సేకరించింది.

# విద్యార్థిని హత్యలో యువకుని పాత్ర లేదు



జమ్మలమడుగు, జూలై 17 (సందేశం టైమ్స్) : గండికోటలో ఇంటర్ విద్యార్థిని హత్య ఘటనలో ఆమె ప్రియుడిగా భావిస్తున్న లోకేశ్ పాత్ర లేదని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని గండికోటలో రంగనాథస్వామి దేవాలయం వెనుకభాగాన ఇంటర్ విద్యార్థిని వైష్ణవి (17) సోమవారం హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రదేశాన్ని ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో డీఐజీ మాట్లాడారు. సోమవారం ఉదయం బాలిక వైష్ణవి, లోకేశ్ ద్విచక్ర వాహనంలో గండికోటకు వచ్చారన్నారు. దాదాపు రెండు గంటలపాటు ఓ ప్రైవేటు లాడ్జీలో ఉన్న తర్వాత ఇద్దరూ కోట గుమ్మం వద్దకు చేరుకున్నారని తెలిపారు. అనంతరం బాలికను అక్కడే వదిలి లోకేశ్ వెళ్లిపోయాడన్నారు. ఆ తర్వాత బాలిక కోట ప్రాంగణంలో బ్యాగుతో తిరిగిందన్నారు. ఈ హత్యలో లోకేశ్ ప్రమేయం లేదన్నారు. అలాగే పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం బాలికపై లైంగిక దాడి జరగలేదన్నారు. హత్యకేసులో కీలక ఆధారాలు లభించాయని త్వరలోనే ఎస్పీ వివరాలు వెల్లడిస్తారని అన్నారు.

# ఒడిశాలో బర్డ్‌ఫ్లూ



విశాఖపట్నం, జూలై 17(సందేశం టైమ్స్) :ఒడిశాలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకుతోంది. ఈ విషయాన్ని అక్కడ పశు సంవర్ధక శాఖ అధికారులు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో ఒడిశాలో చికెన్ అమ్మకాలు గణనీయంగా పడిపోవడంతో ధరలు పతనమయ్యాయి. దీంతో ఒడిశా నుంచి పొరుగునున్న శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలు గుండా ఉత్తరకోస్తా జిల్లాలకు కోళ్లు పెద్దఎత్తున దిగుమతి అవుతున్నాయి. రాజమండ్రి వరకూ వెళుతున్నాయి. ఉత్తర కోస్తాలో ఫారం ధర రూ.70 ఉండగా, ఒడిశా నుంచి కోళ్లను రూ.35 నుంచి రూ.40కు సరఫరా చేస్తున్నారు. ఉత్తరకోస్తాకు రోజుకు 250 నుంచి 300 వ్యాన్‌లలో ఒడిశా కోళ్లు దిగుమతి అవుతున్నట్టు స్థానికంగా ఉన్న కోళ్ల రైతులు చెబుతున్నారు. ఒడిశా నుంచి తెచ్చిన కోళ్లను రిటైల్ మార్కెట్‌లో వెంకాబ్, బ్యాగ్ నిర్ణయించిన ధరకే విక్రయిస్తున్నారు.ఇదిలావుండగా ఒడిశాలో బర్డ్‌ఫ్లూ రావడంతో విశాఖలో బ్యాగ్ ప్రతినిధులు ప్రధానంగా కోళ్ల వ్యాపారులు అప్రమత్తమై రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించారు. దీనిలో భాగంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి సమస్య వివరించారు. ఆయన వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఫోన్ చేసి ఒడిశాలో బర్డ్‌ఫ్లూ వచ్చిన విషయాన్ని తెలియజేశారు. బర్డ్‌ఫ్లూ తగ్గేంత వరకూ ఒడిశా నుంచి కోళ్ల దిగుమతి పూర్తిగా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని గంటా కోరారు. సరిహద్దులో నిఘా పెట్టేలా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

# ఆన్‌లైన్ గేమ్స్ ఆడి అప్పులపాలై



హిరమండలం, జూలై 17 (సందేశం టైమ్స్) :ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ డబ్బులు పోగొట్టుకొని అప్పులపాలైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గులుమూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎండీ యాసీన్ వివరాల మేరకు.. గులుమూరుకు చెందిన మజ్జి బుజ్జి (40) అనే వ్యక్తి హిరమండలంలోని ఓ వాటర్ ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. బుజ్జి గత కొంత కాలంగా ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతున్నాడు. దీనికోసం పలుచోట్ల అప్పులు చేశాడు. ఇందులో భారీ మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై గడ్డి మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుజ్జికి భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# వైకుంఠం క్యూకాంప్లెక్స్ పైనుంచి పడిన భక్తుడు

తిరుమల, జూలై 17 (సందేశం టైమ్స్) : తిరుమలలో వైకుం ఠం క్యూకాంప్లెక్స్ పైఅంతస్తు నుంచి జారి కిందపడి ఓ భక్తుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఒడిశాలోని గంజాం జిల్లా, బడాంపుర్‌కు చెందిన ఎల్లయ్య రెడ్డి(50) ఉదయం వైకుంఠం క్యూకాంప్లెక్స్-1 వద్ద కింద నుంచి పైఅంతస్తుకు గేట్లు పట్టుకుని ఎక్కే ప్రయత్నంలో జారి 25 అడుగుల కిందకు పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో తొలుత తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి.. అక్కడి నుంచి తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అతని మానసిక పరిస్థితి బాగాలేదని స్నేహితులు వివరించారు.



# సంపాదకీయం

## సర్ సంకటంలో భారత ప్రజాస్వామ్యం

భారత ప్రజాస్వామ్యానికి ఉపశమనం, సందేహం లేదు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్)కు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్లపై విచారణలో సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల గురించి నేను ప్రస్తావిస్తున్నాను. సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయాలను స్వాగతించవలసిందే. అయితే అసలు సమస్యపై నుంచి మన దృష్టిని మళ్లించే ఒక తీవ్రప్రమాదమూ వాటిలో అంతర్భాగంగా ఉంది. వయోజనులను ఓటర్‌గా నమోదు చేసేందుకు ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. అలాగే సర్ ప్రక్రియ కేవలం నెల రోజులలో పూర్తి చేయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. బిహార్‌లోని కొన్ని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా సమగ్ర సవరణకు ఎదురయ్యే అవరోధాలనూ ప్రస్తావించింది. నిజమే, అవన్నీ నిజమైన సమస్యలు, జరూరుగా పరిష్కరించవలసినవి. కానీ, ప్రస్తావిత అంశాలపైనే మన దృష్టి కేంద్రీకృతమైతే ప్రాథమిక ప్రాధాన్యమున్న అంశం ఉపేక్షితమయ్యే అవకాశమున్నది. అది బిహార్‌కు మాత్రమే కాదు, సమస్త భారతదేశాన్నీ ప్రభావితం చేసే అంశమది. మరింత కచ్చితంగా చెప్పాలంటే భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య భవిష్యత్తును ప్రతి కూలంగా ప్రభావితం చేసే సమస్య అది.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణతో భారత ప్రజాస్వామ్యానికి దాపురించిన ప్రమాదమేమిటో మనం స్పష్టంగా గుర్తించాలి. అది కేవలం బిహార్‌కు మాత్రమే పరిమితమైనది కాదు. బిహార్ ఆరంభం మాత్రమే. ఆ రాష్ట్రంలో ఆ ప్రక్రియను పూర్తి చేసిన తరువాత అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలోను, అనంతరం దేశవ్యాప్తంగా ఆ ప్రక్రియను అమలుపరిచేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగానే 'సర్' అమలుకు సన్నద్ధమవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘాలను ఈసీఐ ఆదేశించింది. 'సర్' చట్టబద్ధతపై దేశ సర్వోన్నత న్యాయస్థానం విచారణ కొనసాగుతున్న సమయంలోనే ఈసీ ఆ ఆదేశం జారీ చేయడం గమనార్హం. 'సర్' కేవలం ఓటర్ల జాబితా సవరణ కాదు. అది ఓటర్ల జాబితాను సమూలంగా సరికొత్తగా రూపొందించడమే. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఓటర్ల జాబితాను ఎలా సృష్టించాలనే విషయమై నియమాలు, విధానాలు, మార్గదర్శక సూత్రాలను తిరగరాయడమే. ఈ ప్రక్రియ వల్ల సార్వత్రిక వయోజన ఓటుహక్కు పునాది సూత్రమే ప్రమాదంలో పడుతుంది. బిహార్ విషయంలో ఉపశమనం లభించినప్పటికీ ఆ ప్రక్రియను పూర్తిగా రద్దు చేసి తీరాలని మనం డిమాండ్ చేయవలసిన అవసరమున్నది.సార్వత్రిక వయోజన ఓటు హక్కు మన స్వాతంత్ర్యోద్యమ ప్రధాన లక్ష్యాలలో ఒకటి. 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ తొట్టతొలుత ఈ సమున్నత లక్ష్యాన్ని ప్రతిపాదించింది. 1929లో లాహోర్ కాంగ్రెస్‌లో ఆమోదించిన పూర్ణ స్వరాజ్ తీర్మానంలో ఆ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. భారత రాజ్యాంగం 'వయోజన ఓటు హక్కు' సూత్రాన్ని అధికరణ 326 ద్వారా చేర్చుకున్నది : లోక్‌సభ, శాసనసభలకు వయోజన ఓటుహక్కు విధానంపై ఆధారపడి ఎన్నికలు జరుగుతాయి అనగా భారతీయులై ఉండి, నిర్దేశిత తేదీకి 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటుహక్కు ఉంటుంది'. భారతీయ పౌరసత్వానికి ప్రాతిపదిక భారతదేశంలో పుట్టుక, నివాసంపై ఆధారపడి ఉంటుందని అధికరణ 5 పేర్కొంది. ప్రతి పౌరుడి పౌరసత్వానికి అధికరణ 10 భద్రత కల్పించింది: 'భారత పౌరుడు అయిన వ్యక్తి, భారత పౌరుడుగా భావించబడే వ్యక్తి తన పౌరసత్వ హక్కును, పార్లమెంటు ఆమోదించే పౌరసత్వ హక్కు సంబంధిత చట్టాలకు లోబడి ఎన్నటికీ కోల్పోడు'. భారత పౌరసత్వానికి సంబంధించి ఈ రాజ్యాంగ బద్ధ హామీని వాస్తవం చేసేందుకు భారత గణతంత్ర రాజ్యం గత 75 ఏళ్లుగా పరిపూర్ణంగా నెరవేర్చింది. వయోజన ఓటుహక్కు ప్రతి ఒక్కరికీ లభించేందుకు, తద్వారా పౌర సత్వ హోదా ప్రతి ఒక్కరికీ కల్పించేందుకు భారత రాజ్య వ్యవస్థ కట్టుబడి ఉన్నదని అనుపమారాయ్ తన పుస్తకం 'మ్యాపింగ్ ఆఫ్ సిటిజెన్‌షిప్ ఇన్ ఇండియా'లో వివరించారు. 'అవశేష' పౌరులకు (వలస, పేదరికం లేదా సామాజిక విధానాలు ఇత్యాది కారణాల వల్ల సమాజంలో సంపూర్ణ భాగస్వామ్యం నుండి మినహాయింపబడిన వ్యక్తులు) సైతం ఓటింగ్ హక్కులు నిరాకరించడం జరగలేదు. కనుకనే స్వతంత్ర భారతదేశంలో ఓటు వేయడమనేది ఒక లౌకిక ఆచారంగా రూపొంది పవిత్ర హోదాను సంతరించుకున్నదని రాజకీయ మానవశాస్త్రవేత్త ముకులికా బెనర్జీ వాదించారు.ఆమె వాదన విస్తృత ఆమోదం పొందింది. ఈ శుభ పరిణామం యాదృచ్ఛికంగా సంభవించలేదు. ఏ ఒక్క వయోజనుడు మినహాయింపబడకుండా ఓటర్ల జాబితాలో స్థానం పొందేందుకు అవసరమైన చట్టాలు చేసి, వాటిని అమలుపరుస్తున్నారు. అమెరికా, ఇతర ప్రజాస్వామ్య దేశాలలో ఓటరుగా నమోదయ్యేందుకు స్వయంగా ప్రతివ్యక్తి దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. అయితే భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ఓటుహక్కుకు అర్హులైన ప్రతి పౌరుడినీ ఓటరుగా నమోదు చేసే బాధ్యతను రాజ్యు వ్యవస్థపై మోపింది. ఈ కారణంగా అమెరికాలో మొత్తం వయోజనులలో 74 శాతం మంది మాత్రమే ఓటర్ల జాబితాలో ఉండగా మన దేశంలో 96 శాతం మంది వయోజనులు ఓటర్ల జాబితాలో ఉంటున్నారు. ఓటర్ల జాబితాలో నమోదుకు వ్యక్తులు విడివిడిగా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే భారత పౌరుడు అయిన ప్రతి వయోజనుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అంతిమంగా ఎన్నికల అధికారులపై ఉంచారు.

# రైళ్ల పాక్షిక రద్దు... గమ్యాల కుదింపు



విశాఖపట్నం,జూలై 17 (సందేశం టైమ్స్) : కేకే లైనులో సాంకేతిక కారణాల వల్ల రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో కిరండూల్ రైళ్లతోపాటు హిరాకుడ్, సమలేశ్వర్, ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతోపాటు కొరాపుట్ వరకే నడిపిస్తున్నామని సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్ రాత్రి ఎక్స్ ప్రెస్ (18515) ఈ నెల 18 వరకు విశాఖలో బయలుదేరి కొరాపుట్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్- విశాఖ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17 నుంచి 19 వరకు కొరాపుట్లో బయలుదేరి విశాఖ చేరుతుంది. కొరాపుట్-కిరండూల్ మధ్య రాకపోకలు రద్దు చేశారు.అలాగే విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) ఈ నెల 18 తేదీల్లో విశాఖలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో ఇదే తేదీల్లో పాసింజర్ (58502)రైలు కొరాపుట్లో బయలుదేరి విశాఖ చేరుతుంది. హౌరా-జ గదల్పూర్ సమలేశ్వర్ ఎక్స్ ప్రెస్ (18005) ఈ నెల 17న హౌరాలో బయలుదేరి కొరాపుట్ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఇదే ఎక్స్‌ప్రెస్ (18006) ఈ నెల 18, 19లలో కొరాపుట్లో బయలుదేరి హౌరా చేరుతుంది. కొరాపుట్-జగదల్ పూర్ మధ్య రాకపోకలను రద్దు చేశారు.రౌర్కెలా-జగదల్పూర్ ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్ (18107) ఈ నెల 17న రౌర్కెలాలో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలోని ఇంటర్సిటీ (18108) ఈ నెల 17, 18లలో కొరాపుట్లో బయలుదేరి రౌర్కెలా చేరుతుంది. ఈ సర్వీసులకు కొరాపుట్-జగదల్పూర్ మధ్య రాకపోకలు రద్దు చేశారు. భువనేశ్వర్-జగదల్పూర్ హిరాకుడ్ ఎక్స్ ప్రెస్ (18447) ఈ నెల 17న భువనేశ్వర్ బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో ఇదే ఎక్స్‌ప్రెస్ (18448) ఈ నెల 17, 18లలో కొరాపుట్ నుంచి బయలుదేరి భువనేశ్వర్ చేరుతుంది. ఈ సర్వీసులకు కొరాపుట్ జగదల్పూర్ మధ్య రాకపోకలు రద్దు చేసినట్లు డీసీఎం పేర్కొన్నారు.

# కొత్తచెరువు విద్యార్థికి వైద్య సాయం

**అరుదైన వ్యాధితో ఇబ్బంది పడుతున్న విద్యార్థి**
**'మెగా పీటీఎం 2.0'లో సీఎం చంద్రబాబు పలకరింపు**
**బాలుడి ఆరోగ్యం గురించి ఆరాతో సమస్య వెలుగులోకి**
**ఉచిత వైద్యానికి ముందుకొచ్చిన డాక్టర్ శ్రీనివాసరావు**



కొత్తచెరువు, జూలై 17 (సందేశం టైమ్స్) : అరుదైన రుగ్మతతో బాధపడుతున్న శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బాలుకు ఉచిత వైద్య సాయం అందించేందుకు హైదరాబాద్‌కు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరావు నామినేని ముందుకొచ్చారు. కొత్తచెరువులో ఈనెల 10న 'మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ 2.0' నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తచెరువు బీసీ కాలనీకి చెందిన మాధవి తన నలుగురు పిల్లలకు తల్లికి వందనం సొమ్ము అందడంతో.. సీఎం చంద్రబాబును కలిసే అవకాశం దక్కించుకున్నారు. ఆ సమయంలో ఆమె కుమారుడు బాలు.. జుట్టు, శరీరంలో మార్పులను గమనించిన సీఎం.. సమస్య ఏమిటని ఆరా తీశారు. పుట్టుకతోనే ఆరోగ్య సమస్య వచ్చిందని.. వైద్యం చేయించినా నయం కాలేదని మాధవి సీఎంకు వివరించారు. దీంతో బాలుకు వైద్య సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక, ఏబీఎన్ చానల్‌లో కథనాలు వచ్చాయి. స్పందించిన హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాసరావు.. బాలుడికి వైద్య సాయం అందించేందుకు ముందుకొచ్చారు. రెయిన్‌బో చిన్నపిల్లల ఆస్పత్రి డెంటల్ విభాగం, ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ ఇలాంటి అరుదైన వ్యాధులకు వైద్యం చేస్తాయని, బాలుకు ఇక్కడ ఉచిత వైద్యం అందిస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

# 9 లీటర్ల తల్లిపాలు దానం



అనంతపురం వైద్యం,జూలై 17 (సందేశం టైమ్స్) : తల్లి పాలు అమృతం అని చెబుతుంటారు. ఇలాంటి తల్లిపాలను ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 9 లీటర్లు దానం చేసి ఎందరో చిన్నారుల ప్రాణాలు నిలబెట్టారు మాతృమూర్తి దర్శి లిఖిత. అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల మాతృక్షీర నిధికి ఆమె 9 లీటర్ల తల్లిపాలను దానం చేశారు. ఈ సందర్భంగా ఆమెను ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం, ఆర్ఎంవో డాక్టర్ హేమలత సత్కరించారు. నవజాత శిశువులకు తల్లిపాలు అందించేందుకు సర్వజన వైద్యశాలలో 'అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్' పేరుతో మాతృక్షీర నిధిని ఏర్పాటు చేశామని ఆత్మారామ్ తెలిపారు. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న లిఖితకు రెండు నెలల బాబు ఉన్నాడు. ఆమె బిడ్డకు పాలు ఇవ్వగా మిగిలినవి సేకరించి, మొత్తం 9 లీటర్లు దానంచేసి మాతృత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు. అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్‌కు తల్లిపాలను దానం చేయాలనుకునే వారు 8977768275 నంబరులో సంప్రదించాలని కోరారు.

# విదేశాలకు యువత అక్రమ రవాణా

**ఉద్యోగాల పేరిట నమ్మించి మోసం**
**విశాఖ విమానాశ్రయంలో ఇద్దరి అరెస్టు**
**ఐదుగురు బాధితులను రక్షించిన నగర పోలీసులు**




విశాఖపట్నం(మహారాణిపేట), జూలై 17(సందేశం టైమ్స్) :విదేశాల్లో డేటా ఎంట్రీ ఉద్యోగాల పేరిట యువతను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని విశాఖపట్నం సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి మాటలు నమ్మి విదేశాలకు వెళ్లేందుకు ఎయిర్‌పోర్టులో ఉన్న ఐదుగురిని కాపాడారు. విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ రాత్రి తనకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి గాజువాక ప్రాంతం నుంచి మానవ అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం చెప్పారన్నారు. సైబర్‌క్రైమ్ పోలీసులను అప్రమత్తం చేసి ఈ నెల 14న ఎయిర్‌పోర్టుకు పంపించి, గాజువాకకు చెందిన ఏలేటి సురేశ్, రాజాన ఆదిలక్ష్మి అలియాస్ అను అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించామని చెప్పారు. కాంబోడియాలో ఉంటున్న విజయ్‌కుమార్ అలియాస్ సన్ని డేటా ఎంట్రీ ఆపరేటర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించి ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల్లో నిరుద్యోగులను కాంబోడియా, మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాలకు తరలించేందుకు వీలుగా 150 మంది ఏజెంట్లను నియమించుకున్నాడని వివరించారు. వారంతా నిరుద్యోగులను గుర్తించి విదేశాలకు పంపితే, వారితో నకిలీ పత్రాలు, వివరాల ఆధారంగా తప్పుడు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఐడీలు సృష్టించి వాటి ద్వారా డిజిటల్ అరెస్టు, బ్యాంక్‌ఫ్రాడ్స్, లాటరీ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ గేమ్ టాస్క్ పేరుతో అమాయకుల నుంచి డబ్బులు గుంజే పనులు చేయిస్తారన్నారు. ఇప్పటివరకూ కాంబోడియాకు మానవుల అక్రమ రవాణాకు సంబంధించి తొమ్మిది కేసుల్లో 24 మంది నిందితులను అరెస్టు చేసి, 87 మంది బాధితులను రక్షించామన్నారు. విదేశాలకు మనుషులను పంపించే ఏజెంట్లు, సంస్థలకు ఉండాల్సిన అనుమతులు, అర్హతలకు సంబంధించిన వివరాలు ప్రజలకు తెలిపేలా రూపొందించిన రెండు పోస్టర్లను సీపీ ఆవిష్కరించారు.



# క్రీడావార్తలు



## దీపికదే మ్యాజిక్ స్కిల్ అవార్డు



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు స్ట్రయికర్ దీపిక అంతర్జాతీయ వేదికపై మెరిసింది. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) పాలిగ్రాస్ మ్యాజిక్ స్కిల్ అవార్డును 21 ఏళ్ల దీపిక గెలుచుకుంది. ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో అత్యంత సృజనాత్మకత, నైపుణ్యవంతమైన ప్రదర్శన కనబరచిన ఆటగాళ్లకు మ్యాజిక్ స్కిల్ అవార్డును అందజేస్తారు. ప్రపంచవ్యాప్తంగా హాకీ అభిమానులు ఓటింగ్ ద్వారా అవార్డు విజేతను నిర్ణయిస్తారు. ఈ సీజన్ ప్రొ లీగ్‌లో భాగంగా భువనేశ్వర్‌లో నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరపున దీపిక కళ్లు చెదిరే ఫీల్డ్ గోల్ చేసింది. ఈ ప్రదర్శనే దీపికకు అవార్డు తీసుకొచ్చింది. ఈ అవార్డు నామినేషన్స్‌లో స్పెయిన్ క్రీడాకారిణి పాట్రిసియా, ఆస్ట్రేలియా మహిళల జట్టును అధిగమించి దీపిక విజేతగా నిలిచింది.

## ఆర్సీబీ తొక్కిసలాట..
## ప్రభుత్వ రిపోర్టులో సంచలన విషయాలు

ఐపీఎల్ 2025లో ఆర్సీబీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. 18 ఏళ్ల తర్వాత ఆర్సీబీ విజయం సాధించింది. ఈ నేపథ్యంలోనే జూన్ 4వ తేదీన బెంగళూరులో విక్టరీ పెరేడ్ నిర్వహించాలని ఆర్సీబీ యాజమాన్యం చూసింది. అయితే, పరేడ్ నిర్వహించడానికంటే ముందే రద్దయింది. చిన్నస్వామి స్టేడియం దగ్గర భారీ తొక్కిసలాట జరిగింది. 11 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసుకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వం కీలక రిపోర్టు తయారు చేసింది.ఆ రిపోర్టును కర్ణాటక హైకోర్టుకు ఇచ్చింది. చిన్నస్వామి స్టేడియం దగ్గర జరిగిన తొక్కిసలాటకు ప్రధాన కారణం ఆర్సీబీనేనని స్పష్టం చేసింది. పోలీసుల నుంచి సరైన అనుమతులు తీసుకోకుండా.. పోలీసులను సంప్రదించకుండా ఆర్సీబీ విక్టరీ పెరేడ్ చేయడానికి పూనుకుందని పేర్కొంది. ఆ




రిపోర్టులో.. 'ఆర్సీబీ జూన్ 3వ తేదీన పోలీసులను సంప్రదించింది. విక్టరీ పెరేడ్‌కు అవకాశం ఉందని తెలిపింది. ఇది కేవలం సమాచారం ఇవ్వటం కోసం మాత్రమే చేసింది. పరేడ్ నిర్వహించటం కోసం చట్టపరంగా పర్మీషన్లు అడుగుతూ కాదు. పోలీసులకు ఎలాంటి అప్లికేషన్ ఇవ్వలేదు. కబ్బన్ పోలీస్ స్టేషన్ సీఐ కూడా కేఎస్‌సీఏకు పరేడ్ కోసం పర్మిషన్ ఇవ్వలేదు. ఎంత మంది వస్తారో తెలీదు కాబట్టి.. ఆయన పర్మీషన్ ఇవ్వలేదు' అని అన్నారు. రిపోర్టు సబ్‌మిట్ చేస్తున్న సమయంలో కోర్టు, ప్రభుత్వం మధ్య ఓ ఆసక్తికరమైన సంభాషణ జరిగింది. ఆర్సీబీ విక్టర్ పెరేడ్ విషాదంపై సబ్‌మిట్ చేసిన రిపోర్టును అత్యంత గోప్యంగా ఉంచమని ప్రభుత్వం హై కోర్టును కోరింది. అయితే, కోర్టు ఇందుకు ఒప్పుకోలేదు. దాన్ని గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఏమీ లేదని స్పష్టం చేసింది.

## రూట్ నెం.1 రికార్డు



దుబాయ్: ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానానికి చేరుకున్నాడు. బ్యాటర్ల జాబితాలో గతవారం హ్యారీ బ్రూక్‌కు టాప్ ర్యాంక్‌ను కోల్పోయిన రూట్.. బుధవారం ప్రకటించిన తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రపీఠాన నిలిచాడు. ఈ క్రమంలో 2014 డిసెంబరులో సంగక్కర (37 ఏళ్ల వయసులో) తర్వాత టెస్టుల్లో నెంబర్‌వన్‌గా నిలిచిన పెద్ద వయసు బ్యాటర్‌గా 34 ఏళ్ల రూట్ రికార్డుకెక్కాడు. ఇక, ఇప్పటిదాకా టాప్‌లో ఉన్న బ్రూక్ మూడో స్థానానికి పడిపోయాడు. కేన్ విలియమ్సన్ మూడు నుంచి రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. భారత బ్యాటర్లలో యశస్వీ జైస్వాల్ 5, పంత్ 8, గిల్ 9వ ర్యాంకుల్లో ఉన్నారు. కేఎల్ రాహుల్ ఐదు స్థానాలు మెరుగై 35వ ర్యాంక్‌కు చేరాడు. ఇక, లార్డ్స్ టెస్టులో ఇంగ్లండ్ బౌలర్ల ఆధిపత్యం చెలాయించినా, ర్యాంకింగ్స్‌లో మాత్రం టీమిండియా స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానం చెక్కు చెదరలేదు. బుమ్రా బౌలర్ల జాబితాలో నెంబర్‌వన్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. రబాడ రెండో ర్యాంక్‌లో ఉన్నాడు.

## పేస్ పిచ్‌లపై స్పిన్ మాయ




ఇంగ్లండ్ పిచ్‌లు పేసర్లకు స్వర్గధామం. అలాంటి వికెట్‌పై ఓ స్పిన్నర్ ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టిందంటే అది ఆమెలోని అసాధారణ ప్రతిభకు నిదర్శనమే. ఆ అద్భుత నైపుణ్యంతోనే అందరి దృష్టినీ ఆకర్షించింది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ లెఫ్టామ్ స్పిన్నర్ శ్రీచరణి. క్లిష్టమైన ఇంగ్లండ్ పర్యటనకు జట్టులో చోటు కల్పిస్తూ సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకానికి ఆమె పూర్తిగా న్యాయం చేసింది. ఇంగ్లండ్‌తో తొలి టీ20లో 210 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో శ్రీచరణి స్పిన్ మాయాజాలానికి ఇంగ్లండ్ కుదేలైంది. కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్, ఎకెల్‌స్టోన్ వంటి సత్తా కలిగిన బ్యాటర్లు సైతం శ్రీచరణి స్పిన్ బంతులను ఎదుర్కోలేకపోయారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన నల్లపురెడ్డి శ్రీచరణి క్రికెట్ అరంగేట్రం ఎంతో ఆసక్తికరం. క్రికెట్‌కు ముందు ఆమె ఎన్నో ఆటలాడింది. ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో రాణించింది. కానీ క్రికెట్‌లోకి అడుగుపెట్టేందుకు మాత్రం ఆమె మామయ్య కిశోర్‌కుమార్‌రెడ్డే కారణం. అయితే ఈ ఆటలో ప్రొఫెషనల్ అవుతానని మాత్రం శ్రీచరణి అస్సలు అనుకోలేదు. మొదట పేస్ బౌలింగ్‌లో ప్రయత్నించింది. కానీ వికెట్లు సాధించలేకపోయింది. దాంతో స్పిన్ బౌలింగ్‌ను ఎంచుకుంది. వాస్తవంగా..శ్రీచరణిని బ్యాడ్మింటన్ ప్లేయర్‌గా చూడాలనేది తండ్రి చంద్రశేఖర్‌రెడ్డి కోరిక. క్రికెట్‌కు మారతానంటే ఆయన ఓ పట్టాన అంగీకరించలేదు. శ్రీచరణి మాత్రం తాను క్రికెట్ మాత్రమే ఆడతానని భీష్మించింది. కుమార్తె పట్టుదలను చూసిన ఆయన సంవత్సరం తర్వాత తన అంగీకారాన్ని తెలిపారు. క్రికెట్ ఆటంటే మాటలా! బాగా ఖర్చుతో కూడుకున్నది. శ్రీచరణి తండ్రి అప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు.. కుమార్తెను క్రికెటర్‌గా తీర్చిదిద్దేందుకు ఆయన మరిన్ని ఆర్థిక ఇబ్బందులకూ వెరవలేదు. అలా తండ్రితోపాటు తల్లి ఇచ్చిన ప్రోత్సాహంతో కొద్దికాలంలోనే ఆమె రాష్ట్రస్థాయిలో సత్తా చాటడంతో జాతీయ సెలెక్టర్ల దృష్టిలో పడింది.

## బరిలో అర్జున్ ప్రజ్ఞానంద



లాస్ వెగాస్ (యూఎస్ఏ): తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి, తమిళ స్టార్ ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతి.. బుధవారం నుంచి జరిగే లాస్ వెగాస్ ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో పోటీపడుతున్నారు. ఈ మెగా టోర్నీలో ప్రపంచ చాంపియన్ గుకేశ్ ఆడడం లేదు. టోర్నీలో మొత్తం 16 మంది క్రీడాకారులు రెండు గ్రూపులుగా విడిపోయి తలపడనున్నారు. వైట్ గ్రూప్‌లో కార్ల్‌సన్, ప్రజ్ఞానంద ఉండగా, బ్లాక్ గ్రూప్ నుంచి అర్జున్, విదిత్ బరిలో ఉన్నారు. ప్రతి గ్రూప్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన ఆటగాళ్లు క్వార్టర్స్‌కు చేరతారు. ఈనెల 21న ఫైనల్ జరగనుంది. టోర్నీ విజేతకు రూ. 1.71 కోట్లు ప్రైజ్‌మనీగా దక్కనుంది.

## సింధు తొలి రౌండ్లోనే..



టోక్యో: భారత స్టార్ పీవీ సింధు జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ఆరంభ రౌండ్లోనే పరాజయం పాలైంది. కొరియా షట్లర్ సిమ్ యు జిన్‌తో బుధవారం జరిగిన పోరులో మాజీ ప్రపంచ చాంపియన్ సింధు 15-21, 14-21తో చిత్తయింది. ఇలా.. తొలి రౌండ్లోనే ఓడడం ఈ ఏడాదిలో సింధుకిది ఐదోసారి కావడం గమనార్హం. మిగతా భారత అమ్మాయిల్లో అనుపమ ఉపాధ్యాయ 21-15, 18-21, 21-18తో సహచర షట్లర్ రక్షితపై నెగ్గగా, ఉన్నతి హుడా 8-21, 12-21తో పోర్న్ చోచువాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ 21-11, 21-18తో వాంగ్ జెంగ్ (చైనా)ను ఓడించి రెండో రౌండ్ చేరాడు. డబుల్స్‌లో ప్రపంచ 15వ ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి 21-18, 21-10తో కొరియా జంట కాంగ్ మిన్/కిమ్ డోంగ్‌ను చిత్తుచేసి టోర్నీలో శుభారంభం చేసింది. డబుల్స్‌లో హరిహరణ్/రూబన్ కుమార్ జోడీ, మహిళల డబుల్స్‌లో కవిప్రియ/సిమ్రన్ ద్వయం ప్రత్యర్థుల చేతిలో ఓడి ఆదిలోనే ఇంటిబాట పట్టారు.

## ఇంగ్లండ్‌కు రెండు పాయింట్ల కోత



లండన్: లార్డ్స్‌లో భారత్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్‌కు పాల్పడిన ఇంగ్లండ్‌పై ఐసీసీ చర్యలు తీసుకుంది. రెండు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్లు కోత విధించడంతోపాటు ఇంగ్లండ్ జట్టు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానాగా విధించింది. నిర్ణీత సమయంలో బౌల్ చేయాల్సిన ఓవర్ల కంటే రెండు ఓవర్లు తక్కువగా వేయడంతో మ్యాచ్ రెఫరీ చర్యలు తీసుకొన్నాడు. దీంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఇంగ్లండ్ మూడో స్థానానికి పడిపోయింది. మూడో టెస్ట్‌లో టీమిండియాపై ఇంగ్లండ్ 22 పరుగుల తేడాతో గెలిచింది. కాగా, ఐసీసీ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'ఇరుజట్లూ ఈ తప్పిదం చేశాయి. కానీ, ఒక్క టీమ్‌పైనే చర్యలు తీసుకోవడమేంటో నాకు అర్థం కావడం లేదు' అని వాన్ ఎక్స్‌లో పోస్టు చేశాడు.

## బంగ్లాదే టీ20 సిరీస్



కొలంబో: ఆతిథ్య శ్రీలంకతో టీ20 సిరీసను బంగ్లాదేశ్ 2-1తో గెలుచుకుంది. బుధవారం జరిగిన ఆఖరిదైన మూడో టీ20లో బంగ్లా 8 వికెట్లతో లంకను ఓడించింది. మొదట శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లకు 132 పరుగులు చేసింది. ఓపెనర్ నిస్సాంక (46) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మెహిదీ హసన్ (4/11) నాలుగు వికెట్లతో లంక బ్యాటింగ్ పతనాన్ని శాసించాడు. ఛేదనలో బంగ్లా.. ఓపెనర్ తన్జిద్ హసన్ (73) అర్ధ సెంచరీకి తోడు కెప్టెన్ లిట్టన్ దాస్ (32) రాణించడంతో 16.3 ఓవర్లలోనే 133/2 స్కోరు చేసి గెలిచింది.

# బిజినెస్



## టెక్ మహీంద్రా లాభం రూ.1,140 కోట్లు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో టెక్ మహీంద్రా ఏకీకృత నికర లాభం రూ. 1,140.60 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలానికి ఆర్జించిన రూ. 851.5 కోట్ల లాభంతో పోలిస్తే దాదాపు 34 శాతం వృద్ధి కనబరిచింది. కమ్యూనికేషన్స్, రిటైల్, బీఎఫ్ఎస్ఐ విభాగాలు మెరుగైన వృద్ధి సాధించడం ఇందుకు దోహదపడింది. ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 2.7 శాతం వృద్ధి చెంది రూ. 13,351.2 కోట్లకు పెరిగింది. మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే మాత్రం కంపెనీ లాభం 2.2 శాతం, ఆదాయం 0.2 శాతం తగ్గింది. ప్రస్తుతం ఐటీ రంగంలో నెలకొన్న అస్థిర వాతావరణంలో కంపెనీ ప్రణాళికలకు అనుగుణమైన పురోగతిని జూన్ త్రైమాసిక పనితీరు ప్రతిబింబిస్తోందని టెక్ మహీంద్రా సీఈఓ, ఎండీ మోహిత్ జోషి అన్నారు. మరిన్ని ముఖ్యాంశాలు..గడిచిన మూడు నెలల్లో 80.9 కోట్ల డాలర్ల విలువైన కొత్త కాంట్రాక్టులను కంపెనీ దక్కించుకుంది. ఈ క్యూ1లో బీఎఫఎసఐ విభాగం నుంచి ఆదాయంలో వార్షిక ప్రాతిపదికన 4.7 శాతం వృద్ధి నమోదైంది. రిటైల్, లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్ట్ 3.8 శాతం, కమ్యూనికేషన్స్ 2.5 శాతం వృద్ధి చెందాయి. మాన్యుఫాక్చరింగ్ విభాగ రెవెన్యూ మాత్రం 4 శాతం తగ్గగా.. టెక్నాలజీ, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రెవెన్యూ 3.3 శాతం తగ్గింది. ప్రాంతాల వారీగా చూస్తే, యూరప్ మార్కెట్ నుంచి ఆదాయం 11.7 శాతం పెరగగా.. అమెరికా నుంచి రెవెన్యూ 5.9 శాతం తగ్గింది. ఈ జూన్ 30 నాటికి టెక్ మహీంద్రాలో మొత్తం 1,48,517 మంది పనిచేస్తున్నారు. ఏడాది క్రితంతో పోలిస్తే ఉద్యోగులు నికరంగా 897 మంది పెరిగారు.

## తగ్గిన బంగారం ధరలు.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




బంగారం ధర మళ్లీ లక్ష రూపాయలకు దగ్గరల్లో ట్రేడ్ అవుతోంది. గత వారంలో 98 వేలకు దగ్గర్లో ఉన్న పది గ్రాముల బంగారం ప్రస్తుతం తిరిగి లక్ష రూపాయలు చేరువ అయింది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జులై 17న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 99, 270కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 90, 990కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ.500 వరకు తగ్గింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 99, 420కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 91, 140కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 99, 270కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 90, 990కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

## స్వల్ప నష్టాల్లో స్టాక్‌మార్కెట్లు.. ఈ రోజు టాప్ స్టాక్స్ ఇవే..




భారత్‌తో ఇండోనేసియా తరహా వాణిజ్యం ఒప్పందం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం మదుపర్లను కలవరపెడుతోంది. అలా అయితే దేశీయ తయారీ రంగానికి ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే రష్యాతో వ్యాపారం చేస్తే వంద శాతం సుంకాలు విధిస్తామని భారత్, చైనాలకు నాటో దేశాలు హెచ్చరికలు చేయడం కూడా మార్కెట్లను కలవరపరుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాల్లో కదలాడుతున్నాయిబుధవారం ముగింపు (82, 634)తో పోల్చుకుంటే గురువారం ఉదయం వంద పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల బాట పట్టింది. ఒక దశలో దాదాపు 100 పాయింట్లు కోల్పయి 82, 532 వద్ద కనిష్టానికి చేరింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 69 పాయింట్ల నష్టంతో 82, 565 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 22 పాయింట్ల నష్టంతో 25, 189 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో బ్లూ స్టార్, ఏంజెల్ వన్, ప్రెస్టీజ్ ఎస్టేట్, సోనా బీఎల్‌డబ్ల్యూ, కేఈఐ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, యూనియన్ బ్యాంక్, మ్యాక్స్ ఫైనాన్సియల్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ, ఇండియన్ బ్యాంక్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 5 పాయింట్ల స్వల్ప నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 73 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.83గా ఉంది.

## ఇక గోల్డ్, సిల్వర్ ఈటీఎఫలకు దేశీయ కమోడిటీ ఎక్స్ఛేంజ్ రేట్లే ప్రామాణికం





న్యూఢిల్లీ: బంగారం, వెండి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్) ద్వారా మ్యూచువల్ ఫండ్స్ కలిగి ఉన్న భౌతిక బంగారం, వెండి విలువ లెక్కింపు విధానాన్ని పునఃసమీక్షించాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ యోచిస్తోంది. ఇందుకోసం మ్యూచువల్ ఫండ్ కంపెనీలు దేశీయ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లు ప్రకటించే స్పాట్ ధరలను ప్రామాణికంగా తీసుకోవాలని సెబీ ప్రతిపాదించింది. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్.. లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్ (ఎల్ఎంబీఏ) ధరలను ప్రామాణికంగా తీసుకుంటున్నాయని బుధవారం విడుదల చేసిన చర్చాపత్రంలో నియంత్రణ సంస్థ పేర్కొంది. గోల్డ్, సిల్వర్ ఈటీఎఫల్లో మరింత స్థిరత్వంతో పాటు దేశీయ మార్కెట్ ధరలతో వీటిని అనుసంధానించేందుకు సెబీ తాజా ప్రతిపాదన దోహదపడనుంది. అంతేకాదు, దేశీయంగా ఒకే ప్రామాణిక ధరను ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంచే స్పాట్ ధరను

## జియోబ్లాక్‌రాక్ నుంచి 5 కొత్త ఫండ్స్




న్యూఢిల్లీ: కొత్తగా ఐదు మ్యూచువల్ ఫండ్ పథకాలు ప్రారంభించేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం లభించిందని జియోబ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ బుధవారం వెల్లడించింది. జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ 8-13 ఇయర్ జీ-సెక్ ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ నెక్స్ 50 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్ ఈ జాబితాలో ఉన్నాయి. ఇందులో నాలుగు ఈక్విటీ ఫండ్లు కాగా.. ఒకటి డెట్ ఫండ్. ఈ నెల 7న సంస్థ 3 న్యూ ఫండ్ ఆఫర్ల (ఎన్ఎఫఓ) ద్వారా మొత్తం రూ.17,800 కోట్లు సమీకరించింది. ముకేశ్ అంబానీకి చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జేఎఫఎసఎల్), అమెరికా చెందిన బ్లాక్‌రాక్‌తో కలిసి సమ భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన కంపెనీయే జియోబ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్.

## హైదరాబాద్‌లో బ్రిగేడ్ గ్రూప్ కొత్త కో వర్కింగ్ సెంటర్



రియల్టీ సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్.. హైదరాబాద్‌లో మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. హైటెక్ సమీపంలోని మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్ వద్ద 50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కో-వర్కింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. తన అనుబంధ సంస్థ బజ్‌వర్క్స్ ద్వారా బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ ఈ ప్రాజెక్ట్ చేపట్టింది. ఈ కో వర్కింగ్ కేంద్రంలో 1,000 మంది పని చేయవచ్చని ప్రకటించింది. కాగా కంపెనీ ఇప్పటికే హైటెక్ సిటీ సమీపంలోనే కో వర్కింగ్ సెంటర్‌ను నిర్వహిస్తోంది.

## కాకినాడ ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రాజెక్టులో కదలిక



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద క్రౌన్ ఎల్ఎన్‌జీ హోల్డింగ్స్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేసే ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రాజెక్టుకు సంబంధించి మరో అడుగు ముందుకు పడింది. ఈ టెర్మినల్‌ను అనుసంధానం చేస్తూ పైప్‌లైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (పీఐఎల్) పైప్‌లైన్ ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించిన అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై ఇటీవల క్రౌన్ ఎల్ఎన్‌జీ హోల్డింగ్స్ సీఈఓ స్వపన్ కటారియా, పీఐఎల్ ఎండీ అఖిల్ మెహరోత్రా సంతకాలు చేశారు. క్రౌన్ ఎల్ఎన్‌జీ.. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీని రీగ్యాసిఫికేషన్ చేసి దేశ ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోని వినియోగదారులకు ఈ పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తుంది.రూ. 9,000 కోట్ల ప్రాజెక్టు: కాకినాడ ఎల్ఎన్‌జీ ప్లాంట్ కోసం క్రౌన్ ఎల్ఎన్‌జీ హోల్డింగ్స్ రూ. 9,000 కోట్ల వరకు ఖర్చు

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006